www.ninadam.in

నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం మే 05 2026

ninadam.in

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

తమిళనాట మారిన రాజకీయ సమీకరణాలు..

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్‌కు విజయ్ లేఖ!

- సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరణ.. మెజారిటీకి కొద్ది దూరంలో
- ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలంటూ గవర్నర్‌కు విజయ్ లేఖ
- రెండు వారాల్లో బలం నిరూపించుకుంటామని వెల్లడి
- తమిళ రాజకీయాల్లో నెలకొన్న తీవ్ర ఉత్కంఠ

తొలి ఎన్నికల్లోనే సత్తా చాటిన విజయ్ పార్టీ టీవీకే

చెన్నై, మే 5 (నినాదం) : నటుడి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన 'దళపతి' విజయ్, తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించారు. ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, తొలిసారి పోటీ చేసిన అసెంబ్లీ ఎన్నికల్లోనే అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, అతిపెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 108 స్థానాలు గెలుచుకున్నప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 స్థానాల మ్యాజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలో నిలిచిపోయింది. దీంతో తమిళనాడులో హంగ్ అసెంబ్లీ ఏర్పడగా, రాష్ట్ర రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ రాజకీయ అనిశ్చితి 02

రైతును రాజు చేసేంత వరకు విశ్రమించం

గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేసేందుకు పదేళ్ల సమయం

గతంలో వరి వేస్తే ఉరి అనే పరిస్థితి ఉండేదన్న మంత్రి

సన్న వడ్లకు బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని వెల్లడి

హన్మకొండ మే 5 (నినాదం) : తమది రైతు పక్షపాత ప్రభుత్వం అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హనుమకొండలో జరిగిన 'మెగా రైతు మేళా'లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి గత ప్రభుత్వం పదేళ్ల సమయం తీసుకుందని... కానీ తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నుంచి బయటపడేస్తూనే, రైతులకు 02

సీఎం పదవికి

రాజీనామా చేసిన స్టాలిన్

- తమిళనాడు ఎన్నికల్లో డీఎంకేకు ఘోర పరాజయం
- రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ పార్టీ టీవీకే
- తన రాజీనామాను రాష్ట్ర గవర్నర్ కు పంపించిన స్టాలిన్

చెన్నై, మే 5 (నినాదం) : తమిళనాడులో రాజకీయ ముఖచిత్రం సంపూర్ణంగా మారిపోయింది. దశాబ్దాలుగా తమిళగడ్డను గుప్పెట్లో పెట్టుకుని శాసించిన ద్రవిడ పార్టీల (డీఎంకే, అన్నాడీఎంకే) కంచుకోటలు బద్దలయ్యాయి. సినీ 02

అధిక వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు కాస్త ఊరట

- క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఒక డిగ్రీ మేర తగ్గిన ఉష్ణోగ్రతలు
- రెండు మూడు రోజుల్లో మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం
- పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు

హైదరాబాద్, మే 5 (నినాదం) : తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. సాయంత్రం దాకా ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం ఏడు గంటలకే ఎండ తీక్షణంగా కాస్తోంది. కాగా, క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక డిగ్రీ మేర తగ్గాయి. రానున్న రెండు మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి మళ్లీ క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు తెలిపారు. ఈరోజు, రేపు, ఎల్లుండి 02

హైదరాబాద్‌లో బిఎఎస్ఎఫ్ భారీ పెట్టుబడి

- రెండు GCCలు, 3,000 ఉద్యోగాల సృష్టికి శ్రీకారం
- డిజిటల్ & సర్వీసెస్ హబ్ల కోసం Lo I సమర్పించిన బిఎఎస్ఎఫ్
- ప్రతి సంవత్సరం 100 GCC ల లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం
- హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ & ఇంజినీరింగ్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం
- AI సిటీ, క్వాంటమ్ హబ్, వన్ బయో ల్యాబ్ వంటి మెగా ప్రాజెక్టులకు ఊతం
- ప్రపంచ దిగ్గజ సంస్థలతో హైదరాబాద్‌కు మరింత గ్లోబల్ గుర్తింపు

హైదరాబాద్, మే 5 (నినాదం) : ప్రపంచంలోని అతిపెద్ద రసాయన తయారీ సంస్థలలో ఒకటైన BASF, హైదరాబాద్‌లో రెండు 'గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లను' ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. ఒక 'గ్లోబల్ డిజిటల్ హబ్' , ఒక 'గ్లోబల్ సర్వీసెస్ హబ్'ను స్థాపించే ఉద్దేశంతో, ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక 'ఉద్దేశపూర్వక లేఖ'ను సమర్పించింది. ఐటీ , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ 02

బెంగాల్, అసోంలలో

ఓట్ చోరీ

- జనాదేశ్‌ను చోరీచేసిన బిజెపి
- మరోమారు రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ, మే 5 (నినాదం) : బెంగాల్, అసోంలో ఓటు చోరీ జరగిందని విపక్షనేత రాహుల్ మరోమారు ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశ 02

మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

హైదరాబాద్, మే 5 (నినాదం) : జూబ్లీహిల్స్ బాలికల ట్రాప్, చీటింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు.. 19 మంది మైనర్లను ట్రాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిందితులను విచారించామని.. ఈ విచారణలో పలు విషయాలు

ఇన్‌స్టా వేదికగా వల విసిరి లోబర్చుకున్న బ్రదర్స్

ఖరీదైన కార్లలో తిప్పతూ అత్యాచారాలు

కేసులో అర్జున్ తల్లి, మేనమామల అరెస్ట్

వివరాలు వెల్లడించిన కమిషనర్ సజ్జన్నార్

వెలుగులోకి వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లో మూడుగంటల పాటు నిందితులను సీపీ ప్రశ్నించారు. అర్జున్ అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు. రిచ్ కిడ్స్‌ను అర్జున్, ఆయన సోదరుడు ప్రవీణ్ టార్గెట్ చేశారని సజ్జనార్ వెల్లడించారు. మైనర్లను ట్రాప్ చేసి ఖరీదైన కార్లలోనే లైంగిక చర్యలకు అర్జున్ పాల్పడ్డాడని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎస్కార్ట్‌గా ఉంటూ మైనర్లకు వల విసిరారని చెప్పారు. అర్జున్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో 150 మంది అమ్మాయిలు ఫాలో అవుతున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం అర్జున్ ప్రొఫైల్‌ను తాము లాక్ చేశామని తెలిపారు. ఇద్దరు నిందితులకు వారి తల్లి మీనాకుమారి కూడా సహకరించినట్లుగా గుర్తించామని అన్నారు. నిందితుల 02

ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు

పులిట్జర్ పురస్కారం

- పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే పురస్కారం
- ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మలను వరించిన పులిట్జర్

న్యూఢిల్లీ,మే 5 (నినాదం) : ఇద్దరు భారతీయ జర్నలిస్టులను ప్రఖ్యాత పులిట్జర్ పురస్కారం వరించింది. పాత్రికేయ రంగంలో దీనిని అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా భావిస్తారు. డిజిటల్ నిఘా, సైబర్ మోసాలను విస్తృతంగా వెలుగులోకి తెచ్చినందుకు ఆనంద్ ఆర్కే, సుపర్ణాశర్మలు ఈ అవార్డును దక్కించుకున్నారు. ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్, కామెంటరీ విభాగం కింద దీనిని 02

కొట్టారు.. గెంటేశారు.. లూటీ చేశారు..

భవానీపూర్ ఫలితంపై మమత ఆవేదన

- ఈసీ, సీఆర్పీఎఫ్ నీచమైన ఆట ఆడాయన్న మమత
- కౌంటింగ్ కేంద్రంలోకి గూండాలు చొరబడ్డారని వ్యాఖ్య
- తన ఏజెంట్లను బయటకు నెట్టి ఫలితాన్ని మార్చేశారని ఆరోపణ
- ఈ తీర్పును న్యాయపరంగా సవాల్ చేస్తామని స్పష్టీకరణ

కోల్‌కత్తా, మే 5 (నినాదం) : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భవానీపూర్ ఎన్నికల ఫలితంపై సంచలన ఆరోపణలు చేశారు. ఇది ఎన్నికల సంఘం ఆడిన నీచమైన, 02

శస్త్రచికిత్స తర్వాత తొలిసారి బయటకొచ్చిన పవన్ కల్యాణ్

దివంగత మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావుకు నివాళి

- గత నెలలో అనారోగ్యం కారణంగా రాలేకపోయిన పవన్

హైదరాబాద్, మే 5 (నినాదం) : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శస్త్రచికిత్స అనంతరం పూర్తిస్థాయిలో కోలుకున్నాక తొలిసారిగా మంగళవారం బయటకు వచ్చారు. ఇటీవల దివంగతులైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు ఆయన నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లిన పవన్, భాస్కరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గత నెల 22న నాదెండ్ల భాస్కరరావు కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో పవన్ కల్యాణ్ సైనస్ సమస్యకు 02

రబీ వరి సేకరణ వేగవంతం

- అన్‌లోడింగ్, రవాణా పెంచాలని కమిషనర్ ఆదేశాలు
- నల్గొండ జిల్లా పెదకపర్తి సేకరణ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ
- 25,000 క్వింటాళ్ల వరి రాక; 7,000 క్వింటాళ్ల సేకరణ పూర్తి
- ట్యాబ్ ఎంట్రీ 100% పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు
- గోనె సంచులు, టార్పాలిన్‌ల లభ్యతపై సమీక్ష
- మిల్లుల్లో స్థల కొరత ఉంటే మధ్యంతర గోదాములకు తరలింపు సూచన
- రవాణా వేగం పెంచేందుకు మరిన్ని వాహనాల ఏర్పాటు

హైదరాబాద్, మే 5 (నినాదం) : రబీ వరి సేకరణ ప్రక్రియలో భాగంగా, రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ కార్యకలాపాలను పెంచాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. వాహనాల రొటేషన్‌ను పెంచాలని, సేకరణ కేంద్రాల నుండి వరి రవాణాను వేగవంతం చేయాలని, అదనపు లారీలు మరియు హమాలీలను మోహరించాలని కూడా ఆయన వారికి సూచించారు. మంగళవారం, నల్గొండ జిల్లా చిట్యాల్ మండలం, పెదకపర్తిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి సేకరణ కేంద్రంలో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ పర్యటన సందర్భంగా, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మరియు కేంద్ర అధికారులతో కలిసి ఇప్పటివరకు అందిన వరి పరిమాణం, హమాలీల లభ్యత, ట్రక్ షీట్లు, మిల్లులకు 02

రవీంద్రుని జయంతి రోజు

ప్రమాణస్వీకారం

- కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై బిజెపి స్పష్టత
- సిఎం అభ్యర్థిని ఎంపికచేయనున్న అధిష్టానం

కోల్‌కతా, మే 5 (నినాదం) : పశ్చిమబెంగాల్‌లో మే 9న భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ 02

శస్త్రచికిత్స తర్వాత తొలిసారి బయటకొచ్చిన పవన్ కల్యాణ్

శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఆయన అంత్యక్రియలకు హాజరుకాలేకపోయారు. అయితే, వార్త తెలిసిన వెంటనే భాస్కరరావు కుమారుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్‌లో పరామర్శించారు. తాజాగా ఆరోగ్యం కుదుటపడటంతో వైద్యుల సూచన మేరకు మంగళవారం ఆయన నేరుగా సహచర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. చాలా రోజుల తర్వాత పవన్ కల్యాణ్ మళ్లీ సాధారణ స్థితిలో కనిపించడంతో జనసేన కార్యకర్తలు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్ పురస్కారం

ప్రకటించారు. ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ బ్లూమ్‌బర్గ్‌కు చెందిన నటాలీ ఒబికో పియర్సన్‌తో కలిసి వీరిద్దరు ఈ అవార్డును పంచుకోనున్నారు. పులిట్జర్ బోర్డు సోమవారం న్యూయార్క్‌లో విజేతలను ప్రకటించింది. విజువల్ రిపోర్టింగ్, వ్యాఖ్యానం విభాగంలో వారు దీనిని గెలుచుకున్నట్లు పులిట్జర్ వెబ్ సైట్ పేర్కొంది. కొలంబియా యూనివర్సిటీ ఈ అవార్డును అందిస్తుంటుంది. బ్లూమ్ బర్గ్‌లో 'ట్రాప్డ్' అనే శీర్షికతో ప్రచురితమైన పరిశోధనాత్మక రిపోర్టులో సాంకేతికతను వినియోగించి మోసగాళ్లు, సామాన్యులను ఎలా ట్రాప్ చేస్తున్నారో, వారికి ఎదురయ్యే ప్రమాదాలను ప్రపంచానికి చాటిచెప్పింది. ఫోన్ ద్వారా డిజిటల్ అరెస్టుకు గురైన భారతదేశంలోని ఒక న్యూరాలజిస్ట్ గురించి చెబుతూ, ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం పెరుగుతున్న నిఘా, డిజిటల్ మోసాల సవాళ్లను కళ్లకు కట్టినట్లు ఈ పరిశోధనాత్మక రిపోర్టు వివరించింది.

రైతును రాజు చేసేంత వరకు విశ్రమించం

రూ. 21 వేల కోట్ల రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేసిందని గుర్తుచేశారు. గత హయాంలో 'వరి వేస్తే ఉరి' అన్న పరిస్థితులు ఉండేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు భరోసా కల్పిస్తూ సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వంగా నిలిచిందని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎకరానికి రూ. 12 వేల ఆర్థిక సాయంతో పాటు అత్యాధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 1,200 కోట్లు చెల్లించిందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతును రాజు చేసే వరకు తమ ప్రభుత్వం విశ్రమించబోదని, ప్రతి రైతుకు మద్దతు ధరతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

అధిక వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు కాస్త ఊరట

క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

బెంగాల్, అసోంలలో ఓట్ చోరీ

రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఓటమి చెందడంతో కొందరు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో జనాదేశాన్ని బీజేపీ చోరీచేసిందని ఆరోపించారు. ఇది కేవలం ఓ పార్టీ ఓటమి కాదని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేసే ప్రమాదకర పరిణామం అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనా లను పక్కనపెట్టి.. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణపై అన్ని పార్టీలు దృష్టి సారించాలని ఈ సందర్భంగా రాహుల్ పిలుపునిచ్చారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య' అని ఆయన పేర్కొన్నారు. విపక్ష పార్టీల మధ్య అనైక్యత పెరుగుతున్న నేపథ్యంలో.. అది బీజేపీకి వరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు దేశ ప్రజాస్వామ్య వినాశనానికి సంకేతాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని రాహుల్ హెచ్చరించారు. విపక్షాలు పరస్పర విభేదాలను తగ్గించి, ప్రజాస్వామ్య రక్షణ కోసం ఒకే వేదికపైకి రావాలని సూచించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

సీఎం పదవికి రాజీనామా చేసిన స్టాలిన్

నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ రెండేళ్లలోనే తమిళనాడులో అధికారాన్ని చేజిక్కించుకుంది. తమిళ ఓటర్లు, ముఖ్యంగా జెన్ జీ యువత విజయ్ కు పట్టం కట్టారు. వరుసగా రెండు సార్లు సీఎంగా అధికారిన్ని చలాయించిన స్టాలిన్ తీవ్ర పరాభవాన్ని మూటకట్టుకున్నారు. డీఎంకే పార్టీ రెండో స్థానానికి పరిమితం అయింది. ఎవరూ ఊహించని విధంగా కొళత్తూర్ నియోజకవర్గంలో స్టాలిన్ 9 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పరాజయం పాలవడంతో ముఖ్యమంత్రి స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆయన గవర్నర్‌కు పంపించారు. మరోవైపు, తాజా ఫలితాల ప్రకారం ఏ పార్టీకి కూడా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 స్థానాల మ్యాజిక్ ఫిగర్ దక్కకపోవడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా నిలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకే ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. 72 స్థానాలు సాధించిన డీఎంకే కూటమి, 53 స్థానాల్లో నిలిచిన అన్నాడీఎంకేలను కాదని, మెజారిటీకి అవసరమైన మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతును కూడగట్టే పనిలో విజయ్ నిమగ్నమయ్యారు. ఎవరితో పొత్తు పెట్టుకోవాలనే అంశంపై పార్టీ నేతలతో కీలక చర్చలు జరుపుతున్న విజయ్... ఇప్పటికే గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. అతిపెద్ద పార్టీగా ఉన్న తమకే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరనున్నారు.

మోదీ పర్యటన నేపథ్యంలో బీజేపీపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖ

- ఈ నెల 10న తెలంగాణ పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ
- రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ఇక్కడి కేంద్ర మంత్రులు మాట్లాడటం లేదని విమర్శ
- గోదావరి పుష్కరాల కోసం రాష్ట్రానికి కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపాటు

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న తెలంగాణ పర్యటనకు వస్తున్న సంగతి తెలిసిందే. మోదీ హైదరాబాద్ సభ కోసం బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో, మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు కేవలం మీటింగ్‌లు పెట్టడం, 'జై శ్రీరామ్' అనడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అలా అనడం వల్ల పైనుంచి నిధులు పడుతున్నాయా లేదా పథకాలు వస్తున్నాయా అని ఆమె ప్రశ్నించారు. ప్రధానిని పిలిపించి హిందీలో నాలుగు మాటలు చెప్పించి పంపడం తప్ప, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ఇక్కడి కేంద్ర మంత్రులు కానీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కానీ మాట్లాడటం లేదని ఆమె ధ్వజమెత్తారు. ముఖ్యంగా గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు కోట్లాది రూపాయలు విడుదల చేసిన కేంద్రం, తెలంగాణకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం రేవంత్ రెడ్డి గారు రూ. 4,200 కోట్లు కేటాయించారని చెప్పారు. తెలంగాణపై బీజేపీకి ఏ మాత్రం ప్రేమ లేదని మండిపడ్డారు. అదేవిధంగా, బీఆర్ఎస్ పార్టీపై కూడా మంత్రి కొండా సురేఖ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ కళ్లు ఉండి చూడలేని, చెవులు ఉండి వినలేని పార్టీ అని మండిపడ్డారు. గత పదేళ్లలో రైతులను పట్టించుకోని వారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు పలికిందని విమర్శించారు.

నేను సీఎం పదవికి రాజీనామా చేయను... మేం ఓడిపోలేదు

- బెంగాల్ ఎన్నికల ఫలితాలను తిరస్కరించిన మమతా బెనర్జీ
- 100 స్థానాలను అక్రమంగా దక్కించుకున్నారని ఆరోపణ
- ఎన్నికల అక్రమాలపై 15 మందితో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ
- భవానీపూర్‌లో ఓడినా రాజీనామా చేయబోనని స్పష్టీకరణ
- మమతకు ఇండియా కూటమి నేతల మద్దతు

కోల్‌కతా, మే 5 (నినాదం) : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పూర్తిగా తిరస్కరించారు. తాను సీఎం పదవికి రాజీనామా చేయబోనని, తాము ఓడిపోలేదని అన్నారు. ఎన్నికల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ఇది "ప్రజాస్వామ్య హత్య" అని ఆమె తీవ్రంగా వ్యాఖ్యానించారు. తాము ఈ ఫలితాలను చట్టబద్ధమైన ఓటమిగా అంగీకరించ బోమని స్పష్టం చేశారు. కోల్‌కతాలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ దాదాపు 100 స్థానాలను అక్రమంగా దొంగిలించిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్, కేంద్ర బలగాలు పక్షపాతంగా వ్యవహరించాయని, దాదాపు 90 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి కుట్రపూరితంగా తొలగించారని విమర్శించారు. తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లోనూ ఓటమి పాలైనప్పటికీ, తాను రాజీనామా చేయబోనని మమత స్పష్టం చేశారు. తన రాజకీయ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై నిజ నిర్ధారణకు 15 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రానికి వెళ్తున్న సమయంలో తన కారును అడ్డుకుని, తనపై భౌతిక దాడికి యత్నించారని ఆమె ఆరోపించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు గూండాల్లా వ్యవహరించాయని మండిపడ్డారు. ఈ క్లిష్ట సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్ వంటి 'ఇండియా' కూటమి నేతలు తనకు ఫోన్ చేసి మద్దతు తెలిపారని మమత వెల్లడించారు. మొత్తం 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 సీట్లు గెలుచుకుని అధికారాన్ని కైవసం చేసుకోగా, టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల రోజును బెంగాల్ రాజకీయ చరిత్రలో ఒక 'చీకటి రోజు'గా ఆమె అభివర్ణించారు.

విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గెజిట్.. చిరకాల స్వప్నం నెరవేరిందన్న సీఎం చంద్రబాబు

- విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై గెజిట్ విడుదల
- ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందన్న సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, రైల్వే మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి
- 2026 జూన్ 1 నుంచి అధికారికంగా జోన్ కార్యకలాపాలు ప్రారంభం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది దోహదపడుతుందని ఆశాభావం

అమరావతి, మే 5 (నినాదం) : ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నమైన విశాఖపట్నం రైల్వే జోన్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వే శాఖ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిన చారిత్రాత్మక క్షణమని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్ర విజ్ఞప్తిని మన్నించి చారిత్రాత్మక గెజిట్ విడుదల చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 2026 జూన్ 1వ తేదీ నుంచి విశాఖ కేంద్రంగా జోన్ కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. వాల్తేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలాస-ఇచ్ఛాపురం వంటి కీలక సెక్షన్లను విశాఖ డివిజన్‌లో విలీనం చేయడం శుభపరిణామమని చంద్ర బాబు పేర్కొన్నారు. ఈ మార్పులతో ఉత్తరాంధ్ర రవాణా రంగ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన విశాఖ, రాయగడ డివిజన్ల మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా ఉత్తరాంధ్ర పారిశ్రామిక ప్రగతికి ఈ జోన్ ఏర్పాటు ఎంతగానో దోహదపడు తుందని ముఖ్యమంత్రి వివరించారు.

మే 10న తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన - ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష

హైదరాబాద్, మే 5 (నినాదం) : మే 10న తెలంగాణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లను సమీక్షించేందుకు ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఒక సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన సన్నద్ధతను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు; అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ సమగ్రంగా ఉండేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా, ప్రధానమంత్రి పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు, అలాగే ఒక బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. తదనుగుణంగా, 'బ్లూ బుక్' నిబంధనల ప్రకారం అవసరమైన భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ప్రధాన కార్యదర్శి పోలీసు శాఖను ఆదేశించారు. బేగంపేట విమానాశ్రయం, హెలిప్యాడ్‌లు మరియు కార్యక్రమాలు జరిగే అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలను మోహరించాలని అగ్నిమాపక సేవల శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ ప్రయాణించే అన్ని మార్గాలను తనిఖీ చేసి, అవసరమైన మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పోలీసు, GHMC మరియు రహదారులు & భవనాల శాఖలను ఆదేశించారు. పర్యటన సాగే అన్ని ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడటానికి అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. ఈ సమావేశానికి తెలంగాణ DGP సి.వి. ఆనంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, వాణి ప్రసాద్, హోం శాఖ కార్యదర్శి శిఖా గోయెల్, ఇంటెలిజెన్స్ ADG అనిల్ కుమార్, పోలీసు కమిషనర్లు సజ్జనార్, రమేష్, సుమతి, అగ్నిమాపక సేవల DG విక్రమ్ సింగ్ మన్, GHMC కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ గుమ్మళ్ల సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార & పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద్ రెడ్డి, HMWSSB MD అశోక్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు హాజరయ్యారు.

నెమళ్లు, జింకలను వేటాడిన ఆరుగురు సభ్యుల ముఠా అరెస్ట్

హైదరాబాద్ మే 5 (నినాదం) : షాద్‌నగర్, మక్తల్ అటవీ ప్రాంతాల్లో జంతువులను వేటాడి, వాటి మాంసం తింటున్న ఆరుగురు సభ్యుల ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు ఎయిర్ గన్‌లు, రైఫిల్, 20 తూటాలు, కారు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో నలుగురు హైదరాబాద్‌కు చెందిన వారు కాగా, ఒకరు నారాయణ్‌పేట, మరొకరు జడ్చర్లకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. వీరిలో ప్రధాన నిందితుడు మహ్మద్ ముజాఫర్ హుస్సేన్.. ఈ ముఠాను ఏర్పాటు చేసినట్టు దర్యాప్తులో తేలింది. వీరంతా జింకలు, నెమళ్లు, కుందేళ్లు, పావురాలను వేటాడుతున్నట్టు గుర్తించారు. జంతువులను వేటాడుతున్న సమయంలో నిందితులు తీసుకున్న వీడియోలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఎప్పటి నుంచి జంతువులను వేటాడుతున్నారనే వివరాలను సేకరిస్తున్నారు.

మైనర్ల ట్రాప్ కేసులో సంచలన విషయాలు

కుటుంబం గుంటూరుకు చెందినదిగా తమ దర్యాప్తులో తేలిందన్నారు. బాలికలు అట్రాక్ట్ అయ్యేలా ఇన్‌స్టాగ్రామ్‌లో అర్జున్ రీల్స్ చేశాడని అన్నారు. ఇక్కడి నుంచి బాలికలను ట్రాప్ చేసి రిచ్‌గా కారులో షికారు అంటూ హైదరాబాద్ రోడ్లపై అర్జున్ అన్నదమ్ములు తిప్పారని చెప్పారు. తమతో ఫిజికల్ రిలేషన్ పెట్టుకునేలా బాలికలపై ఒత్తిడి చేశారన్నారు. ఆ వీడియోలను కూడా నిందితులు రికార్డు చేశారని.. సమయం చూసి తాము ఓ బిజినెస్ మొదలుపెడతామని బాధితులను నమ్మించి డబ్బు అడిగేవారని తెలిపారు. అలా ఓ బాలిక ఇంట్లో తెలియకుండా రూ. 13 లక్షలను నిందితులకు ఇచ్చిందన్నారు. గత ఏడాది కూడా ఇలాగే మరో మైనర్‌ను అర్జున్ ట్రాప్ చేశారని తెలిపారు. ఈ కేసులో మూడు రోజుల పాటు జైల్లో ఉండి ఆయన బయటకు వచ్చారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇకపోతే యువతులను బెదిరించి డబ్బులు కాజేసిన ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఆజాద్ తల్లితోపాటు మేనమామను జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన కార్లలో తిరుగుతున్న ఫొటోలను ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఆజాద్.. స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. యువతులకు దగ్గరై.. ఫొటోలు బహిర్గతం చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఓ మైనర్ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గత నెలలో ఆజాద్, అతడి సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అనుమతితో నాలుగు రోజులు కస్టడీకి తీసుకొని విచారించారు. మోసపోయిన వారిలో ఎక్కువ మంది మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. యువతుల నుంచి కాజేసిన సొమ్మును తల్లి, మేనమామ ఖాతాల్లో జమచేసినట్లు విచారణలో తేలింది. దీంతో తాజాగా వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

కొట్టారు.. గెంటేశారు.. లూటీ చేశారు..

అనైతికమైన ఆట' అని, ఫలితాన్ని 'దొంగిలించారని' ఆమె ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అయిన కల్యాణ్ బెనర్జీతో ఆమె ఫోన్‌లో మాట్లాడిన సంభాషణను ఆయన తన ఫేస్‌బుక్ పేజీలో పంచుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బీజేపీ అభ్యర్థి సువేందు అధికారిపై తాను 16వ రౌండ్ కౌంటింగ్ వరకు ఆధిక్యంలో ఉన్నానని, ఆ తర్వాతే ఫలితం తారుమారైందని మమత ఆ ఫోన్ కాల్‌లో పేర్కొన్నారు. "చివరి కొన్ని రౌండ్లు మాకు పూర్తి పట్టున్న భవానీపూర్ నియోజకవర్గంలో జరిగాయి. ఆ సమయంలో కొందరు గూండాలు ఈసీ అధికారులతో కలిసి కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించారు. సీఆర్పీఎఫ్ సహాయంతో నా ఏజెంట్లను బయటకు గెంటేశారు" అని ఆమె ఆరోపించారు. ఎన్నికల సంఘం, సీఆర్పీఎఫ్, స్థానిక ఎన్నికల అధికారులు (డీఈవో, ఆర్వో) ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు బీజేపీకి అనుకూలంగా పనిచేశారని ఆమె ఆరోపించారు. చివరి రౌండ్లలో టీఎంసీ ఏజెంట్లను తొలగించి, ప్రతిపక్ష ఏజెంట్లను నియమించారని మమత ఆవేదన వ్యక్తం చేశారు. సీల్ లేకుండా ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారని, కౌంటింగ్ చివరి దశలో పారదర్శకత లోపించిందని ఆమె అన్నారు. కరెంట్ కోతల మధ్య గందరగోళం సృష్టించి ఓట్లను బలవంతంగా దొంగిలించారని ఆరోపించారు. ఇది బీజేపీ విజయం కాదని, ప్రతిపక్షానికి నైతిక ఓటమి అని, ఈ 'అనైతిక కుట్ర'ను న్యాయపరంగా సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలన్నీ సేకరించామని, న్యాయవాదిగా కల్యాణ్ బెనర్జీకి వాస్తవాలను వివరిస్తున్నామని ఆమె తెలిపారు.

రబీ వరి సేకరణ వేగవంతం

కేటాయించిన వాహనాలు, టార్పాలిన్లు మరియు ఇతర లాజిస్టిక్స్ వంటి వివరాలను ఆయన సమీక్షించారు. పెదకపర్తి కేంద్రానికి ఇప్పటివరకు 25,000 క్వింటాళ్ల వరి ధాన్యం అందిందని, అందులో 7,000 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి, ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశారని అధికారులు తెలిపారు. సేకరణ కేంద్రంలో సుమారు 15,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఇంకా అందుబాటులో ఉందని వారు తెలిపారు. ఇది ఒక ప్రధాన కేంద్రం కావడంతో, 10 నుంచి 20 అదనపు లారీలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. హమాలీల కొరతను నివారించేందుకు మిల్లు యజమానులకు ముందుగానే సమాచారం అందించామని, ప్రతి సేకరణ కేంద్రంలో సుమారు 30 మంది హమాలీలను నియమించామని, అలాగే మిల్లులలో 30 నుంచి 35 మంది కార్మికులను కూడా నిమగ్నం చేశామని ఆయన వివరించారు. ట్యాబ్ ఎంట్రీ తప్పనిసరిగా 100 శాతం పూర్తి చేయాలని కమిషనర్ నొక్కి చెప్పారు. సేకరణ కేంద్రాలలో వరి ధాన్యం కోసం డ్రైయర్‌ల వినియోగం, శుభ్రపరిచే ప్రక్రియల గురించి కూడా ఆయన ఆరా తీశారు. ఆయన గోనె సంచులు, టార్పాలిన్‌ల లభ్యతను సమీక్షించి, అవసరమైన చోట అదనపు టార్పాలిన్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, ఆయన వట్టిమర్తిలోని సిద్ధార్థ రైస్ ఇండస్ట్రీస్‌ను సందర్శించి, అక్కడ హమాలీల సంఖ్య గురించి ఆరా తీయగా, 35 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలుసుకున్నారు. అన్‌లోడింగ్ మరియు వాహనాల రొటేషన్‌ను పెంచాలని ఆయన యాజమాన్యాన్ని ఆదేశించారు. వరి వివరాలు మరియు ట్యాబ్ ఎంట్రీ రికార్డులను సిస్టమ్ ఆధారితంగా అప్‌లోడ్ చేయడాన్ని కూడా ఆయన సమీక్షించారు. ట్యాబ్ ఎంట్రీలు ప్రతిరోజూ పూర్తి అవుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ట్యాబ్ ఎంట్రీలు గల సేకరణ కేంద్రాలపై దృష్టి సారించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. మిల్లులలో స్థల కొరత ఏర్పడితే, వరిని మధ్యంతర గోదాములకు తరలించాలని ఆయన ఆదేశించారు. అదనంగా, రవాణాను వేగవంతం చేయడానికి మరిన్ని వాహనాలను ఏర్పాటు చేయాలని ఆయన వాణి రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్, పౌర సరఫరాల జీఎం నాగేశ్వరరావు, వాణి రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్, పౌర సరఫరాల అధికారులు వెంకటేశం, డీఎం రాంపతి నాయక్, డీసీఓ పత్య నాయక్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, చిట్యాల్ తహసీల్దార్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రుని జయంతి రోజు ప్రమాణస్వీకారం

రోజున నూతన సీఎం ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. ఠాగూర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఒక కొత్త ఆరంభానికి నాంది పలకడానికి ఈ తేదీని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన పనులు చేస్తున్నామన్నారు. కాగా బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. బెంగాల్ ఎన్నికల ఫలితాల అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ ఉన్నతాధికారులు.. ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్‌కు అందజేయ నున్నారు. బుధవారం ఈ అధికారిక పత్రాలను సీఈసీ.. గవర్నర్ ఆర్.ఎన్.రవికి ఇస్తారు. అనంతరం ఆయన రాజీనామా సమర్పించాల్సిందిగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఆహ్వానిస్తారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసేవరకు మమత తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ఇదిలావుంటే బెంగాల్‌లోని అసన్‌సోల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మూసిఉన్న దుర్గాదేవి ఆలయం సోమవారం తిరిగి తెరుచుకుంది. వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, పరిపాలనాపరమైన ఆంక్షల వల్ల ఈ ఆలయం చాలాకాలంగా మూసేసి ఉంది. దుర్గా పూజ, లక్ష్మీ పూజ వంటి వేడుకల కోసం మాత్రమే దీనిని తెరిచేవారు. తాను గెలిస్తే ఆలయాన్ని తెరిపిస్తానని అసన్‌సోల్ ఉత్తర్ స్థానం నుంచి పోటీ చేసిన భాజపా ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ ప్రజలకు వాగ్దానం చేశారు. చెప్పినట్లుగానే సోమవారం గెలిచిన వెంటనే ఆయన ఆలయాన్ని సందర్శించి పునఃప్రారంభించారు.

తమిళనాట మారిన రాజకీయ సమీకరణాలు..

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్‌కు విజయ్ లేఖ!

నడుమ, ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ చురుగ్గా పావులు కదుపుతున్నారు. అతిపెద్ద పార్టీగా అవతరించిన తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతూ ఆయన రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌కు లేఖ రాశారు. రాజ్‌భవన్‌కు ఈమెయిల్ ద్వారా ఈ లేఖను పంపినట్లు సమాచారం. అసెంబ్లీలో రెండు వారాల్లోగా తమ బలాన్ని నిరూపించుకుంటామని విజయ్ ఆ లేఖలో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాలను మరింత వేడెక్కించింది.

డీఎంకే, ఏఐఏడీఎంకేలకు షాక్.. మారిన రాజకీయ సమీకరణాలు

తాజా ఎన్నికల ఫలితాల్లో అధికార డీఎంకే 59 స్థానాలతో రెండో స్థానానికి, ఏఐఏడీఎంకే 47 స్థానాలతో మూడో స్థానానికి పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి. డీఎంకేను అధికారానికి దూరం పెట్టేందుకు ఏఐఏడీఎంకే (47) విజయ్‌కు మద్దతు ఇస్తుందా? లేక కాంగ్రెస్ (5), ఇతర ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రులతో కలిసి విజయ్ సర్కార్ ఏర్పాటు చేస్తారా? అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్ నేతలు విజయ్‌తో టచ్‌లో ఉన్నారని, రాహుల్ గాంధీ సైతం ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు వార్తలు వస్తున్నాయి. దశాబ్దాలుగా తమిళనాడు రాజకీయాలను శాసించిన డీఎంకే, ఏఐఏడీఎంకేల ద్విముఖ పోరుకు విజయ్ పార్టీ అనూహ్యంగా తెరదించింది. కాగా, ఈ రోజు ఉదయం 11 గంటలకు విజయ్ తన పార్టీ కార్యాలయంలో గెలిచిన అభ్యర్థులతో సమావేశం కానున్నారు. గవర్నర్ నిర్ణయం, పొత్తుల చర్చల తర్వాతే తమిళనాడు రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత రానుంది.

హైదరాబాద్‌లో బిఎఎస్ఎఫ్ భారీ పెట్టుబడి

హాస్పర్ సమక్షంలో, Tobias Dratt ఈ LoIని తెలంగాణ లైఫ్ సైన్సెస్ జజుూ సర్వేష్ సింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వం ఏటా 100 GCCలను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకుందని, వీటి ద్వారా సుమారు లక్ష మంది ఐటీ నిపుణులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను కేవలం కార్యాలయాల కేంద్రంగానే కాకుండా, ఆవిష్కరణలు మరియు ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించిన ఒక ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన నొక్కి చెప్పారు. ఈ దార్శనికతలో భాగంగానే, AIKAM - Young India Skills University, 200 ఎకరాల విస్తీర్ణంలో 'AI City'' 'Quantum Hub'' మరియు లైఫ్ సైన్సెస్ పరిశోధనా కేంద్రమైన 'One Bio Lab' వంటి వినూత్న కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. "160 సంవత్సరాల క్రితం స్థాపించబడిన BASF సంస్థ, 234 ఉత్పత్తి కేంద్రాలతో ప్రపంచవ్యాప్తంగా 200కు పైగా దేశాల్లో తన కార్యకలాపాలను సాగిస్తోంది; ఇందులో 1,08,000 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. దాదాపు ₹5 లక్షల కోట్ల (సుమారు €60 బిలియన్లు) వార్షిక ఆదాయం కలిగిన ఇటువంటి ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడిని, ప్రపంచ స్థాయి పోటీని తట్టుకుని హైదరాబాద్ దక్కించుకోవడం రాష్ట్రానికి ఎంతో గర్వకారణం," అని ఆయన అన్నారు. NVIDIA Microsoft Google Vanguard Eli Lilly మరియు Marriott International వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో తమ GCCలను ఏర్పాటు చేసుకున్నాయని, ఇది నగర ప్రపంచ స్థాయి ఖ్యాతిని మరింత పెంపొందించిందని ఆయన జోడించారు. ఈ కార్యక్రమంలో BASF ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ Alexander Gerdingతో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం మే 05 2026
ninadam.in
EVENING 6 PM
03
డిజిటల్ ఎడిషన్

ఏపీకి మరో భారీ విదేశీ పెట్టుబడి

- ఏపీకి 'క్యారియర్' కిక్.. రూ.1000 కోట్లతో ఏసీల తయారీ ప్లాంట్
- శ్రీసిటీలో ఏసీల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న క్యారియర్
- రూ.1000 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ.. 3000 మందికి ఉపాధి
- రేపు పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్
- మూడు దశల్లో 2028 నాటికి పూర్తికానున్న ప్రాజెక్ట్

తిరుపతి మే 5 (నినాదం) :
ఏపీ పారిశ్రామిక రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ప్రపంచ ప్రఖ్యాత ఎయిర్ కండిషనర్ (ఏసీ) తయారీ దిగ్గజం 'క్యారియర్' రాష్ట్రంలో భారీ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1000 కోట్ల వ్యయంతో అత్యాధునిక తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ పరిశ్రమకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రేపు (బుధవారం) శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

మూడు దశల్లో నిర్మాణం.. 3000 మందికి ఉపాధి

సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో 39 ఎకరాల విస్తీర్ణంలో క్యారియర్ తన నూతన ప్లాంట్‌ను నిర్మించనుంది. మొత్తం రూ.1000 కోట్ల పెట్టుబడిని 2028 నాటికి మూడు దశల్లో పెట్టనుంది. దేశంలో ఏసీలతో పాటు హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్ (ఎవాజా) ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే లక్ష్యంగా ఈ యూనిట్‌ను స్థాపిస్తోంది. అత్యాధునిక మౌలిక వసతులు, స్మార్ట్ తయారీ టెక్నాలజీతో ఈ ప్లాంట్‌ను తీర్చిదిద్దనున్నారు. దీనివల్ల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులు ఇక్కడ తయారవుతాయి.

భారత్‌లో కార్యకలాపాల విస్తరణ

అమెరికాకు చెందిన క్యారియర్ సంస్థకు భారత్‌లో ఐదు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఇప్పటికే హర్యానాలోని గుర్‌గ్రామ్‌లో ఒక తయారీ యూనిట్‌తో పాటు హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఈ సంస్థ నిర్వహిస్తోంది. తాజాగా శ్రీసిటీలో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్, దేశంలో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు దోహదపడనుంది. వ్యూహాత్మకంగా శ్రీసిటీని ఎంచుకోవడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల మార్కెట్‌తో పాటు ఎగుమతులకు కూడా అనుకూలంగా ఉంటుందని కంపెనీ భావిస్తోంది. ఈ భారీ పరిశ్రమ రాకతో తిరుపతి జిల్లా పారిశ్రామిక ముఖచిత్రం మరింత మారనుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రజలకు భద్రత, భరోసా కల్పించేందుకే కార్డెన్ సెర్చ్

\- మంచిర్యాల ఏసీపీ ప్రకాష్,

మంచిర్యాల, మే 5 (నినాదం) :
అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం రామగుండం కమిషనరేట్ మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తిలక్ నగర్ ఏరియా లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్ లేని మరియు సరియైన పత్రాలు లేని 58 ద్విచక్ర వాహనాలను, మరియు 8 ఆటోలను సీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా తనిఖీలు చేపడతామని ప్రతి వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రజలకు భద్రత, భరోసా కల్పించేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని పేర్కొన్నారు. పోలీసులు ప్రజల భద్రతలకు కట్టుబడి శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి తనిఖీలు తరచుగా కొనసాగుతాయని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాటుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా అనుమానాస్పద ఘటనలు జరిగితే వెంటనే 100 నంబరు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ క్రైమ్ బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబరు వినియోగించుకోవాలని సూచించారు. నేర రహిత సమాజం కోసం ప్రజలు, యువత పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించి నడపాలని సూచించారు. యువతను చెడు అలవాట్లకు బానిస కావద్దని గంజాయి మరియు ఆన్లైన్ గేమ్ లు ఆడవద్దు అని పేర్కొన్నారు. తిలక్ నగర్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు సీసీ కెమెరాలు ఉండడం వలన దొంగలను మరియు రాత్రిపూట గొడవ చేసే రౌడీలను పసిగట్టవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ గారు, పట్టణ ఎస్సై లు మధుసూదన్, తిరుపతి మరియు మజారుద్దీన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఒక్క ఓటుతో మాజీమంత్రి ఓటమి

- టీవికె చేతిలో ఒక్క ఓటుతో ఓడిన పెరియకరుప్పన్

చెన్నై, మే 5 (నినాదం) :
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ సృష్టించిన ప్రభంజనంలో పలువురు చిత్తయ్యారు. విజయ్ నేతృత్వంలోని ఆ పార్టీ 108 సీట్లు సాధించి.. అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీగా అవతరలించింది. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. అయితే విజయ్ వేవ్‌లో డీఎంకే నేతలు చెల్లాచెదురయ్యారు. ఆ రాష్ట్ర సహకార శాఖ మాజీ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ అనూహ్య రీతిలో ఓటమిపాలయ్యారు. ఆయన కేవలఅం ఒకే ఒక్క ఓటు తేడాతో ఓటమి చెందారు. తిరుప్పత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తమిళగ వెట్రి కజగం పార్టీ నుంచి సీనివాస సేతుపథి పోటీ చేశారు. అయితే తాజా ఫలితాల్లో టీవీకే నేతకు 83, 375 ఓట్లు పోలయ్యాయి. ఇక రెండవ స్థానంలో పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పడ్డాయి. చాలా ఆసక్తికరంగా ఈ రేస్ కొనసాగింది. చివరి రౌండ్ వరకు పోటీ నువ్వానేనా అన్నట్లుగా సాగింది. చివరి రౌండ్ కన్నా ముందు రౌండ్‌లో 30 ఓట్ల ఆధిక్యంలో డీఎంకే నేత పెరియకరుప్పన్ ఉన్నారు. కానీ అనూహ్యమైన రీతిలో మాజీ మంత్రికి షాక్ తగిలింది. చివరి రౌండ్‌లో టీవీకే నేత సీనివాస సేతుపథ పుంజుకుని విజయాన్ని నమోదు చేశారు. పెరియకరుప్పన్ కన్నా ఒక్క ఓటు ఎక్కువ ఆర్జించారు. దీంతో టీవీకే నేత థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేశారు. తిరుప్పత్తూరు స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ నేత కేసీ తిరుమరన్ మూడవ స్థానంలో నిలిచారు. ఆయనకు 29,054 ఓట్లు పోలయ్యాయి.

రైతులకు 'రాజముద్ర' పాసుపుస్తకాలు..

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసిన పరిటాల సునీత

రాప్తాడు మే 5 (నినాదం) :
రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రైతుల భూముల విషయంలో జరిగిన ఇబ్బందులను ప్రస్తావిస్తూ, సొంత భూమి పత్రాలపై జగన్ మోహన్ రెడ్డి తన ఫొటో వేయించుకోవడంపై మండిపడ్డారు. చెన్నేకొత్తపల్లి, వెల్దురి, బ్రాహ్మణపల్లి పంచాయతీలకు చెందిన దాదాపు 11,482 మంది రైతులకు ప్రభుత్వం అధికారిక ముద్రతో కూడిన పాసుపుస్తకాలను అందించారు. అదేవిధంగా మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, ఇన్‌ఫిన్స్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో 500 మంది మహిళలకు 50 శాతం సబ్సిడీపై కుట్టుమిషన్లను అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం 8 వేల మంది మహిళలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నామని, విద్యార్థులకు సైకిళ్లు ఇచ్చేందుకు కూడా సంస్థ ముందుకు వచ్చిందని వెల్లడించారు. వీటితో పాటు ఐకేపీ యానిమేటర్లకు సెల్‌ఫోన్లు, ఐదుగురు లబ్ధిదారులకు రూ.2.90 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ (జవీ=ఖీ) చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, పెద్ద సంఖ్యలో కూటమి నేతలు పాల్గొన్నారు.

రైతులను గోసపెడుతున్న కాంగ్రెస్

- మక్కల కొనుగోలు కేంద్రాలు ఏవీ
- 6న రైతు సదస్సు విజయవంతం చేయాలన్న చల్లా

వరంగల్, మే 5 (నినాదం) :
రైతులను కష్టాలపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి రైతుల గోస తగులుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. రుణమాఫీ కాలేదని, రైతు భరోసాను ఎగ్గొట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా మక్కలు కొనడం లేదని, దీంతో రైతులు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ఈ నెల 6న హనుమకొండలో నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని చల్లా ధర్మారెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడు మార్కెట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారి సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న మోసాలను అడిగి తెలుసుకున్నారు. 20 రోజులు గడిచిన కాంటాలు పెట్టడంలేదని, ఏది చేయాలన్న డబ్బులు అడుగుతున్నారని, కనీసం తాగడానికి నీళ్లు కూడా మార్కెట్‌లో లేవని, అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే కాంటాలు పెడుతున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యేకి తెలుపుతూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో రైతులతో కలిసి గుడెప్పాడ్ క్రాస్ వద్ద మక్కలు కొనుగోలు చేయాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ..మక్కలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వకుండా, కాంటాలైన బస్తాలు తరలించకుండా కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యకం చేశారు. మక్కల కొనుగోలులో అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నట్టు తెలిపారు. రాహుల్‌గాంధీ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభ నిర్వహించి ఈ నెల 6నాటికి నాలుగేండ్లు పూర్తవుతున్నా ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో చిన్నారి కిడ్నాప్ కలకలం

- తల్లి ఒడిలో ఉండగా అర్ధరాత్రి ఎత్తుకెళ్లిన దుండగులు

హైదరాబాద్, మే 5 (నినాదం) :
హైదరాబాద్‌లో చిన్నారి కిడ్నాప్ కలకలం సృష్టించింది. కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి పక్కన అర్ధరాత్రి తల్లి ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మల్లారెడ్డి ఆస్పత్రి ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న మార్బుల్ షాపు వద్ద ఆదివారం అర్ధరాత్రి నవనీత అనే మహిళ తన నలుగురు పిల్లలతో నిద్రిస్తున్నది. తల్లి నిద్రలో ఉన్న సమయంలో ఒడిలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారి ఆశను ఎవరో దుండగులు ఎత్తుకెళ్లారు. కాసేపటికి మెలకువ వచ్చిన నవనీత చుట్టుపక్కల వెతకగా పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. వెంటనే కుత్బుల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

భార్యను చంపడమెలా?

ఇంటర్నెట్‌లో శోధించిన భర్త

- పద్మజ హత్య కేసును ఛేదించిన పోలీసులు



కడప, మే 5 (నినాదం) :
ఇటీవల సంచలనం రేపిన ప్రొద్దుటూరులో పద్మజ మృతి కేసును పోలీసులు ఛేదించారు. భర్త కిరణ్‌కుమార్ ఆమెను హత్య చేసినట్లు నిర్ధరించారు. అతడిని అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపరిచారు. వివరాలను పోలీసు అధికారులు మీడియాకు వెల్లడించారు. భార్యను హత్య చేసేందుకు కిరణ్ యూట్యూబ్‌లో శోధించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు కొరియర్ ద్వారా విషం తెప్పించాడు. పాలకోవలో విషం కలిపి భార్యకు ఇచ్చాడు. పాలకోవ తిన్న తర్వాత పద్మజ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అనంతరం ఆమె చనిపోయిందో లేదోనని ముఖంపై దిండుతో నొక్కాడు. భార్య లావుగా ఉండటంతోపాటు, తనను నిత్యం అనుమానిస్తోందన్న కారణంతోనే హత్య చేశాడని పోలీసులు తెలిపారు. పెళ్లైన నాటి నుంచి కలిసి మెలిసి ఉండాల్సిన భర్తే ఇలా కాలయముడయ్యాడు. భార్యను చంపడానికి ఒక ప్రొఫెషనల్ కిల్లర్ లాగా ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి, పథకం ప్రకారం హత్య చేసిన సంఘటన ఇది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 29వ తేదీన నిందితుడైన కిరణ్, తన భార్య పద్మను నిద్రిస్తున్న సమయంలో దిండుతో ముఖంపై అదిమి పట్టుకున్నాడు. ఊపిరాడకుండా చేసి అత్యంత కిరాతకంగా ఆమెను హతమార్చాడు. ఈ హత్య యాదృచ్ఛికంగా జరిగింది కాదని.. కిరణ్ గత కొంతకాలంగా ఇంటర్నెట్‌లో 'భార్యను ఎలా చంపాలి?', 'ఎలాంటి ఆధారాలు దొరకకుండా హత్య చేయడం ఎలా?' అని గూగుల్‌లో సెర్చ్ చేశాడని పోలీసులు తెలిపారు. కేవలం దిండుతో చంపడమే కాకుండా, భార్యకు విషం ఇచ్చి చంపడానికి కూడా నిందితుడు ప్రయత్నించాడు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా ఏకంగా రూ. 80,000 ఖర్చు చేసి విషాన్ని ఆర్డర్ చేయడం గమనార్హం. పద్మ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి. అతని సెల్‌ఫోన్, ఇంటర్నెట్ హిస్టరీని పరిశీలించగా, హత్యకు సంబంధించిన కుట్ర అంతా బట్టబయలైంది. నేరస్థులు ఎంత తెలివిగా ఎ÷-లాన్ చేసినా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోలీసులు వారిని పట్టుకోగలరని ఈ కేసు మరోసారి నిరూపించింది. కేవలం గూగుల్ సెర్చ్ చేసిన ఆధారాలతోనే నిందితుడి పక్కా ఎ÷-లాన్‌ను పోలీసులు బహిర్గతం చేశారు. పద్మ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, కిరణ్‌ను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

తమిళనాడులో నటుడు విజయ్ పార్టీ గెలుపుపై ఏపీలో రాజకీయ చర్చ

- పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి అంబటి రాంబాబు సెటైరికల్ ట్వీట్
- టీడీపీ ప్రభుత్వం పైనా అంబటి జోస్యం.. గట్టిగా బదులిస్తున్న టీడీపీ శ్రేణులు

అమరావతి, మే 5 (నినాదం) :
వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమిళనాడు ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ఒంటరిగా ఘనవిజయం సాధించిన నేపథ్యంలో.. పవన్‌పై పరోక్షంగా సెటైర్లు వేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. తమిళనాడులో విజయ్ విజయం తర్వాత పవన్‌పై సోషల్ మీడియాలో సెటైర్లు వస్తున్నాయని ప్రస్తావిస్తూ.. 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టు' అంటూ అంబటి ఓ పోస్ట్ పెట్టారు. నటుడిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ ఒంటరిగా పోటీ చేసి గెలవగా, పవన్ కల్యాణ్ పొత్తుల ద్వారా విజయం సాధించడాన్ని పోలుస్తూ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. ఇదే క్రమంలో అంబటి మరో ట్వీట్‌లో చంద్రబాబు-లోకేశ్ ప్రభుత్వంపైనా జోస్యం చెప్పారు. తమిళనాడులో స్టాలిన్-ఉదయనిధి ప్రభుత్వానికి పట్టిన గతే భవిష్యత్తులో ఏపీలో టీడీపీ ప్రభుత్వానికి పడుతుందని వ్యాఖ్యానించారు. అయితే, అంబటి వ్యాఖ్యలకు టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో గట్టిగానే బదులిస్తున్నాయి. 'ముందు మీకున్న 11 సీట్లను కాపాడుకోండి' అంటూ కౌంటర్ ఇస్తున్నాయి. దీంతో అంబటి ట్వీట్లు, వాటికి వస్తున్న ప్రత్యుత్తరాలు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

పెరిగిన పత్తి ధరలు

- క్వింటాకు రూ.800 పైగా ధర జంప్

కర్నూలు, మే 5 (నినాదం) :
కర్నూలు జిల్లా ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు భారీగా పెరిగాయి. పదిహేను రోజుల్లో పత్తిధర క్వింటాకు రూ.800 పైగా ధర పెరిగింది. ఇప్పటికే పత్తి సీజన్ ముగియడంతో అరకొర పత్తి రైతులు విక్రయానికి తీసుకొస్తుండడంతో వ్యాపారుల మధ్య పోటీ నెలకొనడంతో ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ దూది ధరలు పెరి గాయని, దీంతో స్థానిక మార్కెట్ యార్డులో ధరలు పెరగడానికి మరో కారణమని తెలిపారు. ధరలు పెరగడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 758 క్వింటాల పత్తి విక్రయానికి రాగా.. గరిష్ఠ ధర రూ.9615, మధ్యస్థం రూ.9,300 కనిష్ఠం రూ.5,525 పలికింది.

మళ్లీ తెరపైకి నక్ష ప్రాజెక్ట్



విజయవాడ, మే 5 (నినాదం) :
సొంత ఇల్లు అనేది సగటు మనిషి జీవితకాల కల. రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన ఆస్తికి సరైన పత్రాలు ఉంటే ఆ మనశ్శాంతే వేరు. పట్టణాలు, నగరాలలో ఆస్తుల సరిహద్దుల విషయంలోనో యాజమాన్య హక్కుల విషయంలో తరచూ ఏదో ఒక వివాదం తలెత్తుతుంది. పాతకాలపు రికార్డులు, అస్పష్టమైన కొలతలు సామాన్యులను కోర్టుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతుంటాయి. ఈ గందరగోళానికి తెరదించి, ప్రతి చదరపు అడుగు భూమికి డిజిటల్ గుర్తింపునివ్వాలనే సంకల్పం ఇప్పుడు కార్యరూపం దాలుస్తోంది. ఆకాశం నుంచి డ్రోన్ల నిఘా, భూమిపై అత్యాధునిక సాంకేతికత మేళవింపుతో సాగుతున్న బృహత్తర ప్రక్రియ, పట్టణ వాసుల ఆస్తి హక్కులకు రక్షణ కవచంలా మారబోతోంది. అటకెక్కిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు మళ్లీ వెలుగులోకి రావడం, లక్షలాది మంది ఇళ్ల యజమానుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. 'నక్ష' ప్రాజెక్టుకు పునర్జీవం నగరాలు, పట్టణాల్లో ప్రజల ఇళ్లు, భూములకు అధికారికంగా 'ప్రాపర్టీ కార్డులు' జారీ చేసే లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన 'నక్ష' ప్రాజెక్టు పనులు ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభం కానున్నాయి. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టగా ప్రస్తుత ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరిపి, ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించేందుకు సిద్ధమైంది. గ్రామాల్లో అమలు చేస్తున్న 'స్వామిత్వ' తరహాలోనే, పట్టణ ప్రాంతాల్లో కూడా డ్రోన్ సర్వే, జీఐఎస్ టెక్నాలజీ ఆధారంగా ప్రతి ఆస్తిని డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. దీనివల్ల ఆస్తుల వివరాల్లో పారదర్శకత పెరగడమే కాకుండా, యజమానులకు పూర్తి స్థాయి భద్రత లభిస్తుంది. తొలి దశలో రాష్ట్రంలోని ఒంగోలు, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, గుంటూరు, కాకినాడ, తిరుపతి, ఏలూరు, మంగళగిరి-తాడేపల్లితో పాటు కుప్పం వంటి ప్రధాన నగరాలు, పట్టణాలను ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గతంలో డ్రోన్ సర్వే వరకు పనులు జరిగినప్పటికీ, కీలకమైన క్షేత్ర స్థాయి పరిశీలన, రికార్డుల క్రోడీకరణ, మ్యాపింగ్ వంటి పనులను గత పాలకులు విస్మరించారు. ఫలితంగా ప్రజలకు అందాల్సిన ప్రాపర్టీ కార్డులు అటకెక్కాయి. ఇప్పుడు ప్రభుత్వం 2027, మార్చి నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇతర రాష్ట్రాలు కార్డుల జారీలో ముందంజలో ఉన్న నేపథ్యంలో, మన రాష్ట్రంలోనూ పనులను వేగవంతం చేయాలని యోచిస్తున్నారు. . ఈ ప్రాపర్టీ కార్డు కేవలం కాగితపు ముక్క కాదు.. ఇవి డిజిటల్ పవర్ హౌస్‌లా పనిచేస్తాయి. కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆ ఆస్తికి సంబంధించిన పూర్తి జాతకం కనిపిస్తుంది. ఎవరు యజమాని? భవనం విస్తీర్ణం ఎంత? ఖాళీ స్థలం ఎంత? వంటి వివరాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి. దీనివల్ల భవిష్యత్తులో ఆస్తుల కొనుగోలు, అమ్మకాల సమయంలో మోసాలకు ఆస్కారం ఉండదు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ప్రక్రియలు మునుపటి కంటే సులభతరం అవుతాయి. ప్రాపర్టీ కార్డులు ఉన్నవారికి బ్యాంకులు రుణాల జారీలో ప్రాధాన్యతనిస్తాయని అధికారులు చెబుతున్నారు కేవలం వ్యక్తిగత ప్రయోజనాలే కాకుండా, పట్టణాల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి కూడా ఈ సర్వే డేటా ఎంతో ఉపయోగపడుతుంది. ఏ ప్రాంతంలో ఎంత ఆస్తి ఉంది, ఎక్కడ రోడ్ల విస్తరణ అవసరం, పౌర వసతుల కల్పన ఎక్కడ జరగాలి వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కలుగుతుంది. ఆస్తుల క్రయవిక్రయాల్లో తలెత్తే లిటిగేషన్లకు ఈ కార్డు శాశ్వత పరిష్కారం. ప్రాపర్టీ కార్డుల ద్వారా లభించే కీలక ప్రయోజనాలు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ఆస్తుల వివరాల తక్షణ లభ్యత. భూమి, భవనం విస్తీర్ణం, యాజమాన్య హక్కులపై స్పష్టత. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ప్రక్రియలో వేగం, పారదర్శకత. ఈ కార్డుల ఆధారంగా బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందే వెసులుబాటు. ఆక్రమణలకు తావు లేకుండా ఆస్తుల చుట్టూ డిజిటల్ రక్షణ. మొత్తానికి, ఆగిపోయిన 'నక్ష' ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కడం పట్టణ వాసులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. 2027 నాటికి ప్రతి ఇంటికీ ప్రాపర్టీ కార్డు అందించాలనే లక్ష్యం నెరవేరితే, రాష్ట్రంలో భూ వివాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

రాహుల్ గాంధీపై 99 ట్రెండింగ్...



న్యూఢిల్లీ, మే 5 (నినాదం) :
వెస్ట్ బెంగాల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత.. పాండిచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాన్ని కైవసం చేసుకున్న తర్వాత.. బిజెపి ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. తమిళనాడులో కూడా నిర్ణయాత్మక పాత్రను బిజెపి ఆధ్వర్యంలోని ఏఐడీఎంకే పోషిస్తోంది. ఈ నేపథ్యంలో బిజెపి సోషల్ మీడియా విభాగం కాంగ్రెస్ పార్టీ మీద దాడిని పెంచింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు ప్రారంభించింది. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఓటములను తేదీలు, సంవత్సరాలతో పేర్కొంటూ.. తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది బిజెపి ఐటి విభాగం. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బిజెపిని ఇబ్బంది పెట్టింది. చాలావరకు పార్లమెంటు స్థానాన్ని గెలుచుకొని.. కమలం పార్టీకి షాక్ ఇచ్చింది. దీంతో బిజెపి టిడిపి టిడిపి, నితీష్ కుమార్ పార్టీ సపోర్ట్ తీసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత బిజెపి ఇక ఏమాత్రం ఆలస్యం చేయలేదు. జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ జోరు చూపించింది. కాంగ్రెస్ లేని భారతదేశం అనే నినాదాన్ని నిజం చేసి చూపించే విధంగా ప్రయత్నించింది. ప్రతి ఎన్నికల్లోను జోరు చూపించింది. చెప్పుకోదగ్గ స్థాయి నుంచి మొదలు పెడితే.. అధికారాన్ని దక్కించుకునే స్థానాలను సొంతం చేసుకుని అదరగొట్టింది.వెస్ట్ బెంగాల్ లో ఘనవిజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి బిజెపి సెటైర్లు వేసింది. రెండు దశాబ్దాల కాలంలో దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికలు.. ఉప ఎన్నికలను ప్రస్తావిస్తూ.. 99 ఓటములతో రాహుల్ గాంధీ రికార్డ్ సృష్టించారని ఎద్దేవా చేసింది."రాష్ట్రాలు మారుతున్నాయి. సంవత్సరాలు మారుతున్నాయి. ఫలితం మాత్రం దాదాపుగా మారదు. ఆర్భాటం చేస్తున్నారు. ప్రచారం చేస్తున్నారు. నినాదాలు ఎత్తుకుంటున్నారు. అవకాశానికి తగ్గట్టుగా నినాదాలను మార్చేసుకుంటున్నారు. ఇన్ని చేసినప్పటికీ ఫలితాలు ఒక విధంగా ఉంటాయి.. ఆ ఫలితం పేరు ఓటమి.. ఈ ఓటమి మీతో వస్తూనే ఉంటుంది. వెల్ డన్ రాహుల్ జి" అంటూ బిజెపి సోషల్ మీడియా పేర్కొంది.వెస్ట్ బెంగాల్లో కాంగ్రెస్ పార్టీ మమతాకు సపోర్ట్ చేయలేదు. ఒంటరిగానే పోటీ చేసింది.. మమతను విమర్శిస్తూ రాహుల్ గాంధీ ప్రచారం చేశారు. అయినప్పటికీ రాహుల్ గాంధీ బెంగాల్ ఓటర్ల మనసును చూరగొనలేకపోయారు. దీంతో బెంగాల్ లో కాంగ్రెస్ పార్టీకి దారుణమైన ఫలితం వచ్చింది.. దీనిని ఉద్దేశించి బిజెపి ఐటి విభాగం బీభత్సంగా పోస్టులు చేయడం మొదలుపెడుతోంది. ఇదే సమయంలో అధికార టిఎంసి మీద రెచ్చిపోయింది. ఒక రేంజ్ లో విమర్శలు చేస్తోంది. మోడీ నాయకత్వమే వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి బలమని బిజెపి సోషల్ మీడియా చెబుతోంది.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్
ninadam.in
మంగళవారం మే 05 2026

ఇరాన్‌పై ఇండియా ఫైర్..

యూఏఈపై అటాక్‌లో భారతీయులకు గాయాలను అంగీకరించలేమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మే 5 (నినాదం):
పశ్చిమాసియాలో మళ్లీ పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. అమెరికా, ఇరాన్ దాడులతో యుద్ధం మళ్లీ తీవ్రరూపం దాల్చుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. తాజాగా యూఏఈలోని 'ఫుజైరా పెట్రోలియం ఇండస్ట్రీస్ జోన్'పై దాడి చేయడం పరిస్థితులను మరింత దిగజార్చాయి. ఈ ఘటనలో ముగ్గురు భారతీయులు గాయపడడంపై విదేశాంగ శాఖ తీవ్ర స్థాయిలో మండిపడింది. "ముగ్గురు భారతీయుల గాయానికి కారణమైన ఫుజైరా దాడిని ఏమాత్రం అంగీకరించలేం. వెంటనే ఈ ఘర్షణలను విరమించుకోవాలని, పౌర మౌలిక సదుపాయాలు, అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ఆపాలని కోరుకుతున్నాం" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనే దిశగా సాగే చర్చలు, దౌత్య విధానాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హర్మూజ్ జలసంధి మీదుగా స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్యం కొనసాగేలా చర్యలు తీసుకోవాలనీ కోరింది. ఈ సమస్యలన్నింటినీ శాంతియుతంగా పరిష్కరించుకునే దిశగా చేపట్టే చర్చలకు భారత్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు స్పష్టం చేసింది.

ప్రభాస్ సినిమా షూటింగ్.. ఘోర ప్రమాదం.. ఒకరి మృతి

- ప్రభాస్ 'ఫౌజీ' సెట్స్ లో నెలకొన్న విషాదం

హైదరాబాద్, మే 5 (నినాదం) :
రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ' సెట్స్‌లో విషాదం నెలకొంది. ఈ ఉదయం షూటింగ్ నిమిత్తం వెళ్తున్న యూనిట్ సభ్యుల కారు హైదరాబాద్ శివార్లలోని అబ్దుల్లాపూర్ మెట్ వద్ద ప్రమాదానికి గురైంది. కారు అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. సినిమా షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్న సమయంలో తమ సహచరుడు మరణించాడనే సమాచారంతో చిత్ర యూనిట్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. మరోవైపు, సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా యూనిట్‌లో ఈ ఘటన విషాద ఛాయలను నింపింది. మృతుడి కుటుంబానికి చిత్ర బృందం తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

కాకతీయుల కాలం నాటి ఆలయాన్ని కూల్చివేసిన ప్రభుత్వం

వరంగల్ మే 5 (నినాదం) :
వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని అశోక్‌నగర్ సమీపంలో కాకతీయుల కాలం నాటి ఆలయాన్ని ప్రభుత్వం కూల్చివేసింది. పబ్బ్యం నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఆవరణలో ఉన్న రాష్ట్ర పురావస్తుశాఖ పరిధిలోని శిలాలయాన్ని బుల్డోజర్‌తో కూల్చివేశారు. పురావస్తు, దేవాదాయ శాఖల కనీస అనుమతి లేకుండా కూల్చివేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అండతో కాంట్రాక్టర్ ఇష్టానుసారం గుడిని నేలమట్టం చేశారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూఎస్-ఇరాన్ సంక్షోభం.. భారీ మూల్యం చెల్లిస్తున్న పాకిస్థాన్!

- అమెరికా-ఇరాన్ ఘర్షణతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- వీక్లీ చమురు దిగుమతి బిల్లు 300 నుంచి 800 మిలియన్ డాలర్లకు పెరుగుదల
- వార్షిక చమురు భారం దాదాపు దేశ ఎగుమతుల ఆదాయానికి సమానం
- 85-90 శాతం చమురు దిగుమతులపై ఆధారపడటమే ప్రధాన బలహీనత
- తీవ్ర ద్రవ్యోల్బణం, విదేశీ మారక నిల్వల సంక్షోభంలో కూరుకుపోయిన పాక్

న్యూఢిల్లీ, మే 5 (నినాదం):
అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు పొరుగు దేశమైన పాకిస్థాన్‌ను ఆర్థికంగా కుదిపేస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ద్రవ్యోల్బణం, క్షీణిస్తున్న విదేశీ మారక నిల్వలు, పడిపోతున్న కరెన్సీ విలువతో సతమతమవుతున్న పాక్ ఆర్థిక వ్యవస్థకు ఈ చమురు ధరల షాక్ పెను భారంగా మారింది. ఇది కేవలం తాత్కాలిక సమస్య కాదని, పాక్ ఆర్థిక వ్యవస్థకు తగిలిన నిర్మాణాత్మక దెబ్బ అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇండియా నేరేటివ్ తన కథనంలో విశ్లేషించిన ప్రకారం, అమెరికా-ఇరాన్ యుద్ధ వాతావరణం కారణంగా ఈ ప్రాంతంలో అత్యంత నష్టపోతున్న దేశం పాకిస్థాన్. హర్మూజ్ జలసంధి మూసివేతతో అంతర్జాతీయంగా బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 112 డాలర్లకు పైగా చేరింది. దీంతో రవాణా, బీమా ప్రీమియంలు రికార్డు స్థాయికి పెరిగాయి. ఫలితంగా పాకిస్థాన్ వీక్లీ పెట్రోలియం దిగుమతి బిల్లు 300 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 800 మిలియన్ డాలర్లకు పెరిగింది. అంటే, 167 శాతం పెరుగుదల నమోదైంది. ఈ విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్ లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ధృవీకరించారు.

ఈ లెక్కన పాకిస్థాన్‌పై ఏటా అదనంగా 26 బిలియన్ డాలర్ల భారం పడుతోంది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో పాకిస్థాన్ మొత్తం ఎగుమతుల ద్వారా సంపాదించిన 29.8 బిలియన్ డాలర్లతో దాదాపు సమానం. అంటే, దేశం మొత్తం ఎగుమతుల ద్వారా సంపాదించిన ఆదాయాన్ని కేవలం ఒక్క చమురు దిగుమతులకే చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులనే కదిలించే అంశమని సదరు కథనం పేర్కొంది. పాకిస్థాన్ తన పెట్రోలియం అవసరాల్లో 85 నుంచి 90 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతుంది. ప్రధానంగా గల్ఫ్ దేశాల నుంచి హర్మూజ్ జలసంధి మార్గం ద్వారానే ఈ దిగుమతులు జరుగుతాయి. పాక్‌కు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు లేకపోవడం, వ్యూహాత్మక చమురు నిల్వలు లేకపోవడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పుడు, ఆ ప్రభావం పాకిస్థాన్‌లో నేరుగా ఇంధన ధరలు, రవాణా ఛార్జీలు, విద్యుత్ టారిఫ్‌లు, నిత్యావసర వస్తువుల ధరలపై పడుతుంది. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం, చమురు ధరలు 10 శాతం పెరిగితే పాక్‌లో ద్రవ్యోల్బణం 0.4 నుంచి 0.6 శాతం పెరుగుతుంది. ఇది దక్షిణాసియాలోనే అత్యధికం కావడం గమనార్హం.

విజయ్‌కు అంత ఈజీ కాదు...

ముందున్న మొసళ్ల పండుగ

చెన్నై, మే 5 (నినాదం) :
విజయ్ పార్టీ గెలిచింది. తను కూడా రెండు స్థానాలలో పోటీచేసి గెలిచాడు. అతిపెద్ద పార్టీగా అవతరించి.. అధికారంలోకి రాగలిగాడు. ఒక మంచి రోజు చూసుకొని తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తాడు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి 6 నెలలపాటు హనీమూన్ పీరియడ్ ఉంటుంది. ఆ తర్వాత అసలు సవారి మొదలవుతుంది. ప్రతిపక్షాలు అప్పటిదాకా ఎదురుచూస్తాయి. ఆ తర్వాత విమర్శలు మొదలు పెడతాయి. రాజకీయం అంటేనే అలా ఉంటుంది కదా.. అప్పటిదాకా విజయ్ ని అభిమానించిన వారు విమర్శలు చేస్తారు. ఏక వాక్యంతో సంబోధిస్తారు. అవసరమైతే వ్యక్తిగత విషయాలను కూడా లాగుతారు. పైగా తమిళనాడు రాజకీయాలు అత్యంత దారుణంగా ఉంటాయి.విజయ్ ఎన్నికల ప్రచారంలో తమిళ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు.. మహిళలకు ప్రతినెల 2500 ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. పెళ్ళికానుకగా వధువుకు ఎనిమిది గ్రాముల బంగారం, పట్టుచీర ఇస్తామని వెల్లడించారు. ఉద్యోగాలు లేని గ్రాడ్యుయేట్లకు ప్రతినెల 4000 రూపాయల భృతి ఇస్తామని వెల్లడించారు. దివ్యాంగులకు, వృద్ధులకు ప్రతినెల 3000 పింఛన్ ఇస్తామని చెప్పారు. ఏడాదికి ఆరు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. కొత్తగా 5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువుకోవడానికి విద్యార్థులకు 20 లక్షల వరకు రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఐదు లక్షల మందికి పెయిడ్ ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. స్కూల్ కి వెళ్లే పిల్లలు ఉన్న తల్లులకు ప్రతి ఏడాది 15000 చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఐదు ఎకరాలకు పంట భూములు ఉన్న రైతులకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు.ఈ హామీలు తమిళ ప్రజలను విజయ్ వైపు చూసేలా చేశాయి.

తమిళనాడులో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాజకీయ పార్టీ నాయకులు సరికొత్త విధానాన్ని అవలంబిస్తారు. గతంలో కరుణానిధి, జయలలిత ఓటర్లకు టీవీలు, కుక్కర్లు, వాషింగ్ మిషన్లు కూడా ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రజలను సోమరులను చేయడానికి తమిళనాడు నాయకులు గట్టిగానే కంకణం పట్టుకున్నారు. విజయ్ హామీ ఇచ్చినట్టుగా తమిళ ప్రజలకు ఆ పథకాలు మొత్తం అమలు కావాలంటే లక్షల కోట్ల బడ్జెట్ కావాలి.తమిళనాడు పెద్ద రాష్ట్రం. మన దేశానికి ఆర్థికంగా బలమైన సపోర్ట్ ఇస్తున్న రాష్ట్రాలలో ముందు వరుసలో ఉంటుంది. కాకపోతే తమిళనాడు ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఏమాత్రం బాగోలేదు. తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి 2024 ,25 ఆర్థిక సంవత్సరానికి గాను స్థూల రాష్ట్ర దేశ ఉత్పత్తి 31.55 లక్షల కోట్లుగా ఉంది. 2025,26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిఎస్డీపీ శాతం 35,67,818 కోట్లుగా ఉంది.. రాష్ట్ర బడ్జెట్లో (మూడు శాతం) ఆర్థిక లోటు 1,06,968 కోట్లుగా ఉంది. రాబడి లోటు (1.2%) 41,635 కోట్లుగా ఉంది.2025, 26 బడ్జెట్ అంచనా వ్యయం 4,39,293 కోట్లుగా ఉంది.. రాబడి లోటు, ఆర్థిక లోటు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో.. విజయ్ తన ముందు ఉన్న సవాళ్ళను ఎలా ఎదుర్కొంటారో చూడాల్సి ఉంది. రాష్ట్ర వనరుల నుంచి 75.3, కేంద్ర పన్నులు, గ్రాంట్ల నుంచి 24.7 శాతం రాబడిని తమిళనాడు ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఇది ఆచరణలో సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదు.

ఒకే కుటుంబం, మూడు పార్టీలు, మూడు విజయాలు.. తమిళ రాజకీయాల్లో 'లాటరీ కింగ్' ఫ్యామిలీ ట్రిపుల్ ధమాకా

- తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికల్లో లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ కుటుంబ సభ్యుల అరుదైన విజయాలు
- ఏఐఏడీఎంకే నుంచి భార్య లీమారోజ్, టీవీకే నుంచి అల్లుడు ఆధవ్ అర్జున విజయం
- పుదుచ్చేరిలో సొంత పార్టీతో బరిలోకి దిగి గెలిచిన కుమారుడు జోస్ చార్లెస్ మార్టిన్
- 20 ఏళ్ల తర్వాత లాల్‌గుడి స్థానాన్ని ఏఐఏడీఎంకేకు దక్కించిన లీమారోజ్
- విజయ్ పార్టీ టీవీకే ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆధవ్ అర్జున భారీ మెజారిటీతో గెలుపు

చెన్నై, మే 5 (నినాదం):
తమిళనాడు, పుదుచ్చేరి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే కుటుంబం ట్రిపుల్ ధమాకా సాధించి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'లాటరీ కింగ్'గా పేరుగాంచిన శాంటియాగో మార్టిన్ కుటుంబ సభ్యులు మూడు వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేసి, మూడు చోట్లా విజయం సాధించడం విశేషం. శాంటియాగో మార్టిన్ భార్య లీమారోజ్ మార్టిన్, అల్లుడు ఆధవ్ అర్జున, కుమారుడు జోస్ చార్లెస్ మార్టిన్ ఈ ఎన్నికల్లో గెలుపొందారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు భారీగా విరాళాలు అందించిన శాంటియాగో మార్టిన్ కుటుంబం, ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోనూ తమదైన ముద్ర వేసింది.

20 ఏళ్ల తర్వాత లాల్‌గుడిలో ఏఐఏడీఎంకే గెలుపు

శాంటియాగో మార్టిన్ భార్య లీమారోజ్ మార్టిన్, ఏఐఏడీఎంకే అభ్యర్థిగా లాల్‌గుడి నియోజకవర్గం నుంచి గెలుపొందారు. డీఎంకేకు కంచుకోటగా ఉన్న ఈ స్థానాన్ని ఏఐఏడీఎంకే 20 ఏళ్ల తర్వాత తిరిగి కైవసం చేసుకోవడం గమనార్హం. లీమారోజ్.. నటుడు విజయ్ పార్టీ అయిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అభ్యర్థి కేపీ కృష్ణన్‌పై 2,739 ఓట్ల తేడాతో విజయం సాధించారు. డీఎంకే అభ్యర్థి టి.పరివల్లాల్ 5,230 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2006, 2011, 2016, 2021 ఎన్నికల్లో డీఎంకే ఇక్కడ వరుసగా గెలిచింది. గతంలో 14 ఏళ్ల పాటు ఐజేకే పార్టీలో ఉన్న లీమారోజ్, ఇటీవలే ఏఐఏడీఎంకేలో చేరారు. పార్టీ అధినేత పళనిస్వామి ఆమెను పార్టీ మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

తమిళనాడులో రెండో విజయం.. టీవీకే నుంచి అల్లుడు గెలుపు

మార్టిన్ అల్లుడు, నటుడు విజయ్ పార్టీ టీవీకే ప్రధాన కార్యదర్శి అయిన ఆధవ్ అర్జున, విక్కివాక్కం స్థానం నుంచి భారీ విజయాన్ని నమోదు చేశారు. ఆయన డీఎంకే అభ్యర్థి కార్తీక్ మోహన్‌పై 17,302 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఏఐఏడీఎంకే అభ్యర్థి విజయకుమార్ ఎస్ఆర్ మూడో స్థానంలో



నిలిచారు. గత రెండు ఎన్నికల్లోనూ ఈ స్థానాన్ని డీఎంకేనే గెలుచుకుంది.

పుదుచ్చేరిలోనూ మార్టిన్ కుటుంబం విజయకేతనం

శాంటియాగో మార్టిన్ కుమారుడు జోస్ చార్లెస్ మార్టిన్, పుదుచ్చేరి ఎన్నికల్లో తన సొంత పార్టీ 'లట్చియ జననాయక కట్చి' (ఎల్‌జేకే) నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కామరాజ్ నగర్ నియోజకవర్గంలో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి పీకే దేవదాస్‌పై 10,000 ఓట్లకు పైగా మెజారిటీతో గెలిచారు. గతంలో బీజేపీలో పనిచేసిన జోస్ చార్లెస్, సీట్ల కేటాయింపులో జాప్యం కారణంగా ఆ పార్టీని వీడినట్లు తెలిపారు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంపై తనకు ఇప్పటికీ అభిమానం ఉందని గతంలో ఎన్డీటీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పుదుచ్చేరికి తాను బయటి వ్యక్తినన్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. తాను ఇప్పుడు పుదుచ్చేరిలోనే నివాసం ఉంటున్నానని, ఈ ప్రాంతాన్ని సింగపూర్, హాంకాంగ్ తరహాలో అభివృద్ధి చేయాలనేది తన లక్ష్యమని వివరించారు. తమ కుటుంబం తమిళనాడు, పుదుచ్చేరి రాజకీయాలను ప్రభావితం చేయాలని చూస్తోందన్న ఆరోపణలను ఆయన ఖండించారు. "ప్రజల జీవితాలను మార్చడమే నా లక్ష్యం. పుదుచ్చేరి ప్రజలు నన్ను నమ్మవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు. మొత్తంగా ఒకే కుటుంబం మూడు వేర్వేరు రాజకీయ వేదికలపై నిలబడి ఏకకాలంలో విజయాలు సాధించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

బీజేపీ గెలుపు.. సంవత్సరాల తర్వాత బెంగాల్ లో తెరుచుకున్న దుర్గామాత ఆలయం

- అసన్‌సోల్‌లోని బస్తీన్ బజార్ ప్రాంతంలో పండుగ వాతావరణం
- ఆలయం తలుపులు తెరిపించిన బీజేపీ ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ

కోల్‌కత్తా, మే 5 (నినాదం) :
పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత పశ్చిమ బర్ధమాన్ జిల్లా అసన్‌సోల్‌లోని బస్తీన్ బజార్ ప్రాంతంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. అక్కడ సంవత్సరాలుగా మూతపడ్డ దుర్గామాత ఆలయం తెరుచుకుంది. గతంలో కేవలం పండుగల సమయంలో మాత్రమే తెరుచుకునే శ్రీ శ్రీ దుర్గామాత ఛారిటబుల్ ట్రస్ట్ ఆలయాన్ని, ఇకపై ఏడాది పొడవునా భక్తుల దర్శనార్థం తెరిచి ఉంచాలని నిర్ణయించారు. స్థానిక భక్తుల దశాబ్దాల కల నెరవేరుతూ ఆలయ ద్వారాలు శాశ్వతంగా తెరుచుకోవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసన్‌సోల్ నార్త్ నియోజకవర్గం నుంచి గెలిచిన బీజేపీ నేత కృష్ణేందు ముఖర్జీ, తన ప్రచార సమయంలో ఇచ్చిన హామీని వెనువెంటనే నెరవేర్చారు. జిల్లాలోని అన్ని స్థానాలను బీజేపీ కైవసం

చేసుకోవడంతో ఈ ఆధ్యాత్మిక మార్పు సాధ్యమైంది. ఎన్నికల ఫలితాల అనంతరం కృష్ణేందు ముఖర్జీ స్వయంగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ద్వారాలను భక్తుల కోసం తెరిచారు. గతంలో కేవలం దుర్గా పూజ, లక్ష్మీ పూజలకే పరిమితమైన ఆలయ దర్శనం, ఇప్పుడు నిత్యం అందుబాటులో రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి పనిమనిషికి ఎమ్మెల్యే యోగం..

- పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం
- ఆస్‌గ్రామ్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఇంటి పనిమనిషి కవితా మాజీ
- ఒకప్పుడు నెలకు రూ.2,500 సంపాదించిన కవితా
- తృణమూల్ అభ్యర్థిపై 12,535 ఓట్ల తేడాతో విజయం
- ఆమె ప్రస్థానం స్ఫూర్తిదాయకమంటూ బీజేపీ నేతల ప్రశంసలు

కోల్‌కత్తా, మే 5 (నినాదం) :
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభంజనం సృష్టించింది. మొత్తం 294 స్థానాలకు గానూ 206 సీట్లు గెలుచుకుని భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ చారిత్రక గెలుపులో ఎందరో కొత్త ముఖాలు వెలుగులోకి రాగా, అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న పేరు కవితా మాజీ. ఒకప్పుడు ఇళ్లలో పనిచేస్తూ నెలకు కేవలం రూ.2,500 సంపాదించిన ఆమె, ఇప్పుడు ఆస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి శాసనసభ్యురాలిగా ఎన్నికై అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆమె విజయం ఖరారైన వెంటనే గతంలో ఆమె ఇంటి పనులు చేస్తున్నప్పటి పాత ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. బీజేపీ ఎంపీ పీసీ మోహన్ కూడా ఈ ఫొటోను షేర్ చేస్తూ ఆమె ప్రస్థానాన్ని కొనియాడారు. "నాలుగు ఇళ్లలో పనిచేస్తూ నెలకు రూ.2,500 సంపాదించే బీజేపీ అభ్యర్థి కవితా మాజీ, ఆస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి గెలిచారు. ఇదే బీజేపీ శక్తి. ఇక్కడ అత్యంత సామాన్య పౌరులు కూడా ఉన్నత స్థాయికి ఎదిగి స్ఫూర్తిదాయకమైన చరిత్ర లిఖించగలరు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

ఎవరీ కవితా మాజీ?
దాదాపు రెండు దశాబ్దాల పాటు కవితా మాజీ తన కుటుంబాన్ని పోషించుకోవడానికి ఇళ్లలో పాత్రలు కడుగుతూ, ఇతర పనులు చేశారు. 38 ఏళ్ల కవితా బర్ధమాన్ జిల్లాలోని ఆస్‌గ్రామ్ నివాసి. ఆమె భర్త సుబ్రతా మాజీ రోజువారీ కూలీ. బీజేపీ టికెట్‌పై పోటీ చేసిన ఆమె, క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లకు చేరువయ్యారు. ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి శ్యామ ప్రసన్న లహోరిపై 12,535 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కవితాకు లక్షకు పైగా ఓట్లు రావడం విశేషం. గత దశాబ్ద కాలంగా ఆమె రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. బూత్ స్థాయి కార్యకర్తగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ ఆమెను బరిలోకి దింపింది. ఆ ఎన్నికల్లో ఆమె దాదాపు 41 శాతం ఓట్లు సాధించినప్పటికీ, సుమారు 12,000 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ పట్టు వదలకుండా పనిచేసి ఈసారి గెలుపును అందుకున్నారు. ఆమె సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ ప్రకారం కవితా మాజీపై తీవ్రమైనవి కాని రెండు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆమె మొత్తం ఆస్తుల విలువ రూ.1,61,216. ఇందులో బ్యాంకు డిపాజిట్లు, చేతిలో ఉన్న నగదు, ఎల్ఐసీ పాలసీలు ఉన్నాయి. ఆమె భర్త పేరు మీద 871 చదరపు అడుగుల నివాస స్థలం ఉంది. దీనిని ఆయన తండ్రి బహుమతిగా ఇవ్వగా, దాని ప్రస్తుత విలువ సుమారు రూ.3 లక్షలు. ఒక సామాన్య గృహ కార్మికురాలు పట్టుదలతో పనిచేసి శాసనసభకు ఎన్నిక కావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని పలువురు ప్రశంసిస్తున్నారు.

బెంగాల్ లో ఎంఐఎంకు షాక్.. అన్ని స్థానాల్లో డిపాజిట్ల గల్లంతు

కోల్‌కత్తా, మే 5 (నినాదం) :
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల బరిలో ఎంఐఎం పార్టీకి బెంగాల్ ఓటర్లు కోలుకోలేని షాక్ ఇచ్చారు. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఈ పార్టీ పోటీ చేసిన 12 స్థానాల్లోనూ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. అమ్ జనతా ఉన్నాయున్ పార్టీ నేత హుమయూన్ కబీర్‌తో పొత్తు పెట్టుకుని, బీహార్ ఫార్ములాతో ముస్లిం ఓట్లను చీల్చాలని ఎంఐఎం ప్రయత్నించినప్పటికీ, అది బెంగాల్‌లో ఏమాత్రం పారలేదు. ముఖ్యంగా ఒక స్టింగ్ ఆపరేషన్‌లో హుమయూన్ కబీర్ దొరికిపోవడం ఎంఐఎం కొంపముంచింది. బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకే తాము ముస్లిం ఓట్లను చీలుస్తున్నామని ఆయన ఆ

ఆపరేషన్‌లో వ్యాఖ్యానించడం మైనారిటీ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది. ఈ వివాదం తర్వాత ఎంఐఎం ఆ పార్టీతో తెగదెంపులు చేసుకున్నప్పటికీ, ఓటర్లు మాత్రం ఎంఐఎంను హుమాయున్ కబీర్ భాగస్వామిగానే పరిగణించి తిరస్కరించినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా, బెంగాల్ రాజకీయాల్లో తన ఉనికిని చాటుకోవాలనుకున్న ఎంఐఎం ఆశలు పూర్తిగా అడియాశలయ్యాయి.

బీసీ కులగణన కోసం వీహెచ్ నిరాహారదీక్ష

- 8వ తేదీ లోపు మోదీ స్పష్టతనివ్వాలని డిమాండ్
- బీసీనని చెప్పుకునే మోదీ బీసీలపై వివక్ష చూపుతున్నారని మండిపాటు

హైదరాబాద్, మే 5 (నినాదం) :
బీసీ కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందంటూ, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు (వీహెచ్) సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగబోతున్నట్లు ఆయన ప్రకటించారు. కేంద్రం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తన పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. మే 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో, వీహెచ్ కీలక అల్టిమేటం జారీ చేశారు. 8వ తేదీ లోపు కుల గణనపై స్పష్టత ఇచ్చిన తర్వాతే ప్రధాని రాష్ట్రంలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఓసీ అయినప్పటికీ తెలంగాణలో బీసీ కుల గణన కోసం చొరవ తీసుకున్నారని, కానీ తాను బీసీని అని చెప్పుకునే మోదీ మాత్రం బీసీలపై వివక్ష చూపుతున్నారని దుయ్యబట్టారు. మోదీ పాలనలో నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు.

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి నిజాంపేట్లో అగ్నిప్రమాదం

- 6 ఫర్నిచర్ దుకాణాలు పూర్తిగా దగ్ధం...

హైదరాబాద్, మే 5 (నినాదం) :
బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ లో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు 6 ఫర్నిచర్ దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. షాపుల్లో నిల్వ ఉంచిన ఫర్నిచర్ సామగ్రి పూర్తిగా దగ్ధమై లక్షల రూపాయల నష్టం జరిగింది...సమాచారం అందుకున్న వెంటనే 4 అగ్నిమాపక యంత్రాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు కలిసి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవలే ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో మళ్లీ ఇలాంటి ఘటన జరగడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడం ఉపశమనంగా మారింది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.